
APTEL/25/A2326

# ప్రజలకి చేరువ

సామాన్యుడి ఆయుధం




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ బుధవారం 25-03-2026 సంపుటి : 1 సంచిక : 192 ఎడిటర్ : కుమార్ పేజీలు : 4 వెల రు : 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar

# ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

## యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి



పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొచ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. పేజి 2లో ▶



## హర్మూజ్‌ని దాటి భారత్ దిశగా రెండు ఎల్పీజీ నౌకలు

- తాజాగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి. 2లో..

## ఢిల్లీ పేలుడు కేసు.. జమ్మూకశ్మీర్‌లో ఎన్ఐఏ సోదాలు



శ్రీనగర్: ఢిల్లీ పేలుడు కేసు దర్యాప్తులో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ జమ్మూకశ్మీర్‌లో సోదాలు నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజామునుంచి తనిఖీలు చేపట్టింది. హంద్వారాలోని ఓ వ్యాపారి నివాసంలో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ కేసులో అరెస్టైన వైద్యులకు.. ఆయుధాలు సరఫరా చేసిన వ్యక్తులతో అతడికి సంబంధం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే పలు కీలక పత్రాలతో పాటు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

# యుద్ధ విస్తరణే ఇరాన్ ప్రధానాస్త్రం!

ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన ఈ మార్గాన్ని మూసివేయడం ద్వారా ఇరాన్ గ్లోబల్ ఎకానమీని చిక్కుల్లో పడేసింది.



- రస్ లఫాన్ విధ్వంసం: ఖతార్‌లోని ప్రపంచంలోనే అతిపెద్ద సహజవాయు ప్లాంట్‌పై దాడి జరగడం వల్ల ఏటా 2వేల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లుతోంది. ఇది కోలుకోవడానికి ఐదేళ్లు పడుతుందని అంచనా.
- చమురు ధరల పెరుగుదల: బహ్రెయిన్ నుండి అబుధాబీ వరకు ఉన్న చమురు డిపోలపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేస్తోంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు విఘాతం కలిగింది.

ప్రత్యర్థిని కవ్విస్తూ యుద్ధం అంచుల వరకూ తీసుకెళ్లడం అమెరికా-సోవియట్ యూనియన్ ప్రచ్ఛన్న యుద్ధంలో కీలకం. శత్రువును నిత్యం భయం గుప్పిట్లో ఉంచడమే ఇక్కడ ప్రధాన వ్యూహం. తాజా గల్ఫ్ పోరులో ఇరాన్ ఇదే ఎత్తుగడను అనుసరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. పేజి 2లో ▶



## బియ్యం రవాణాలో కుంభకోణం:

హైదరాబాద్: బియ్యం రవాణాపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసత్యాలు చెప్పారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ కేసులున్న ప్రేమ్‌చంద్ గార్గ్‌ను సలహాదారుగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ప్రభుత్వం చెప్పాలని హరీశ్ ప్రశ్నించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. పేజి 2లో

# ఉత్తరాంధ్ర.. ఇకపై ఉక్కు ఆంధ్రా

- కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ సహకారం వల్లే ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగామని సీఎం చంద్రబాబు అన్నారు.
- ఈ ప్లాంట్ వల్ల లక్ష ఉద్యోగాలు వస్తాయని పునరుద్ఘాటించారు. మూడేళ్లలోనే అందరికీ అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు.

'ఉత్తరాంధ్ర.. ఇక నుంచి ఉక్కు ఆంధ్రా' అంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు."అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ వస్తున్నందున ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్రకు దిక్సూచి అవుతుంది. ఈ ప్రాంత ప్రజలకు మాట ఇచ్చాం.. మార్పు తెచ్చాం. ప్రతి రంగంలో, ప్రతి ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉక్కు రంగంలో దేశంలో అత్యున్నత స్థానానికి ఏపీ చేరుతుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.





## వంటగ్యాస్ కొరతపై ఆందోళన వద్దు: మంత్రి పార్థసారథి

- వంటగ్యాస్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందొద్దు
- ఇండక్షన్ స్టవ్స్, పైప్ గ్యాస్ వాడకంపై అవగాహన
- 31లోగా పంట నష్టం అంచనాల నివేదికలు ఇవ్వాలి
- మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధరపై చర్యలు
- వాట్సాప్ గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**అమరావతి, మార్చి 23 :**
మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం వల్ల గ్యాస్ లభ్యతలో ఇబ్బందులు ఉన్నా, రాష్ట్రంలో సరఫరాపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గ్యాస్ కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్ సమీక్ష అనంతరం ఏపీ సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పేజి 2లో ▶



## నియోజకవర్గాల పునర్విభజనతో మరిన్ని అవకాశాలు

నియోజకవర్గాల పునర్విభజన వల్ల అవకాశాలు మరింత పెరుగుతాయని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో ఆయన సుమారు మూడు గంటలకు పైగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలపై చర్చించారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఆరా తీశారు. కమిటీల ఏర్పాటు విషయంలో పిఠాపురం మోడల్‌ని మిగతా నియోజకవర్గాల్లోనూ అమలు చేయాలని సూచించారు. కూటమి పార్టీల సయోధ్య విషయంలో దిశానిర్దేశం చేశారు.

## సన్న బియ్యానికి బోనస్.. కట్టుబడి ఉన్నాం



హైదరాబాద్: సన్న బియ్యానికి బోనస్ ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బియ్యం కుంభకోణం జరిగిందని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలోని అన్ని అక్రమాలపై దర్యాప్తు చేయాల్సి ఉంటుందని చెప్పారు. శాసనసభలో మంత్రి మాట్లాడారు.
"మాది రైతుపక్షపాత ప్రభుత్వం. రైతుల నుంచి రికార్డు స్థాయిలో బియ్యం సేకరించాం. 72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నగదు చెల్లించాం. ఇంకా మిగిలిన బియ్యం కూడా కొనుగోలు చేస్తాం. ఈ రబీలో కూడా ప్రతి గింజనూ కొంటాం. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ. 86 లక్షల టన్నుల నిల్వ ఉంది.. పంపించేందుకు చర్యలు చేపడుతున్నాం. బియ్యాన్ని మంచి ధరకే విక్రయించాం. ఛత్తీస్‌గఢ్, ఏపీ బియ్యం కంటే మన సోనా మసూరి, బాస్మతి బియ్యానికి డిమాండ్ ఉంది. పేజి 2లో ▶


# జగన్ పై షర్మిల రెడ్డి నిప్పులు

- ఆస్తుల కోసం రాజకీయం చేయట్లేదు
- వివేకా హత్యపై సమాధానం చెప్పే దమ్ములేదా
- విజయమ్మ లేఖ అక్షరాల నిజం
- అబద్ధపు ప్రచారాలతో తప్పుదోవ పట్టించలేరు
- వైఎస్ఆర్ ఆశయాల కోసమే నా పోరాటం

**విజయవాడ, మార్చి 23 :**
తాను వివేకా హత్య గురించి మాట్లాడితే వైసీపీ ఆస్తుల గురించి మాట్లాడుతోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి విమర్శించారు. తనకు ఆస్తులు అజెండా కాదని, వాటి కోసం రాజకీయం చేయడం లేదని స్పష్టం చేశారు. విశాఖలో తాను మాట్లాడింది హత్య గురించి అయితే, వైసీపీ మాత్రం ఆస్తుల అంశాన్ని తెరపైకి తెచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.



## పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్: నారా లోకేశ



- ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు లక్ష మందికి ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.
- తన పాదయాత్రలో యువత సంక్షేమ పథకాల కంటే ఉద్యోగ అవకాశాలనే ఎక్కువగా కోరుకున్నారని ఆయన గుర్తు చేశారు.

అనకాపల్లి: పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు అనకాపల్లిని ప్రపంచపటంలో నిలుపుతుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు." పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చంద్రబాబు సంపాదించారు. ఈ ప్రాజెక్టుకు వేగంగా అనుమతులు ఇచ్చిన కుమారస్వామికి ధన్యవాదాలు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని 2019లో ఆదిత్య మిత్తల్‌ను కోరాను. 2024లో ప్రజలు మాకు ఘన విజయం అందించారు. మేం అధికారంలోకి రాగానే స్టీల్‌ప్లాంట్ కోసం మళ్లీ ప్రయత్నాలు మొదలుపెట్టాం. కేవలం జూమ్ కాల్ ద్వారానే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ తీసుకురాగలిగాం. నా పాదయాత్రలో కొంతమందిని కలిశాను. వారు సంక్షేమం కోరలేదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆర్సెలార్ ప్రాజెక్టు ఉత్తరాంధ్ర స్థితిగతులను మారుస్తుంది" అని మంత్రి లోకేశ్ తెలిపారు.

# సంపాదకీయం

## మహామానవ విషాదానికి కవిత్వ సాక్ష్యం

'Man is condemned to be free' అని కదా అంటాడు సార్త్ర్. మనిషి స్వేచ్ఛ నుండి తప్పించుకోలేడు. స్వేచ్ఛ కోసం జరిగే పెనుగులాటలో స్వేచ్ఛా పిపాస గల బుద్ధిజీవులే ఈ ప్రపంచాన్ని తమ భుజస్కంధాలపై మోస్తారు. ఈ ప్రపంచం నిత్య ఉనికిలో ఉన్నదంటే అది సృజనాత్మకత, స్వేచ్ఛకై పరితపించే కొంతమంది మనుషుల వల్లనే. మానవ జీవితాన్ని అణచివేసే అనేక మూస సాంప్రదాయ, మూస నియమాల సంకెళ్లను బద్దలుకొడుతూపోవడమే సృజనశీలుడైన, స్వేచ్ఛా పిపాసుడైన మనిషి చేసే నిత్య పరిశ్రమ. అలాంటి మానవ శుద్ధి కర్మాగార కార్మికుడిగా నందిని సిధారెడ్డి గారు ప్రవేశం చేసి చాలా కాలమే అవుతున్నది. దానికోసం ఆయన ఎన్నుకున్న పనిముట్టు కవిత్వం.

కవి అయినా, రచయిత అయినా, ఉద్యమకారుడైనా, బుద్ధిజీవులైనా ఎప్పటికప్పుడు అసత్య ప్రపంచాల పెచ్చులను పెకిలించందే వాస్తవ ప్రపంచం ఆవిష్కరణ కాదు. ఉద్యమకారుడు కవి అయితే, కవి ఉద్యమకారుడు అయితే ఈ ప్రక్రియ మరింత మెరుగ్గా సమాజం ముందు స్పష్టం అవుతుంది. ఉద్యమ కార్యకర్త అయిన కవి మానవ భావోద్వేగాల్లోకి, సమాజ మూలాల్లోకి మరింత లోతుగా వెళ్ళగలరు. ఎందుకంటే సమాజ పరిశీలన కోసం కవి, కార్యకర్త కలిసి చేసే అన్వేషణ సంపూర్ణ సత్యాన్వేషణగా ఉంటుంది. కవిత్వం ప్రపంచంలో మరింత లోతుగా వెళ్లడానికి, మానవ భావోద్వేగాలను అర్థం చేసుకోవడానికి క్షేత్రస్థాయి కార్యకర్త పాత్ర దోహదపడుతుంది. నందిని సిధారెడ్డి లోని కవి, కార్యకర్త కలగలిసి ఆయన కవిత్వాన్ని మానవ వికాస సాధనంగా బహిర్గతం చేశాయి. 'భూమి స్వప్నం'తో సిధారెడ్డి మొదలుపెట్టిన ఈ మానవ సమాజ సంస్కరణ పని 'అనిమేష' వరకు కొనసాగుతూనే ఉన్నది. 'సంభాషణ' (1991)లో చౌరస్తాలో సిగ్నల్ పడ్డప్పుడు కార్ల అద్దాలు తుడిచే పిల్లలను, కార్ఖానాల్లో మగ్గిపోతున్న బాల కార్మికుల జీవితాలను ఎంత లోతుగా చూడగలిగాడో, 'అనిమేష' (2020)లో కరోనా వైరస్ దాడికి చెల్లాచెదురైన మనుషుల జీవితాలను అంతే లోతుగా ప్రేమగా చూడగలిగాడు.సిధారెడ్డి ఉద్యమకారుడిగా ఎంత ముక్కుసూటిగా శాస్త్రీయంగా ఉంటారో కవిగా అంత నిశ్చితాభిప్రాయాలతో ఉంటారు. పదాలను కొద్దిగా కాల్పనికతలోకి ముంచి తీస్తారు. సామాజిక జీవిత సత్యాలను వెల్లడించడానికి సిద్ధపడ్డ కవుల కవిత్వం ఎప్పుడు వాస్తవిక, కాల్పనికతల మేళవింపు తోనే ఉంటుంది.అతిమార్మికతలకు సిధారెడ్డి అత్యంత దూరం. చెప్పేది ఏదైనా సూటిగా గుండెకు తాకుతున్నట్టు చెప్పాలనేది ఆయన సిద్ధాంతం. కవిత్వాన్ని లోతైన మార్మికతల నుండి వాస్తవిక, సంపూర్ణ, ఖచ్చిత, ప్రతిఫల సాధనంగా మలచి, సరళం, స్పష్టం, సామాన్యం చేసేందుకు గొప్ప గొప్పవారు చాలా కృషి చేశారు. చెహొవ్ మాక్సిం గోర్కీకి అస్పష్టతల నుండి దూరం కమ్మని పదేపదే చెబుతుండేవాడు. సిధారెడ్డి కూడా తన దగ్గరివారికి ఇలాంటి సలహాలే ఇస్తూ ఉంటారు. సిధారెడ్డి లాగా చెప్పడం ఒక కళ, వారికే సాధ్యమైన కళ: "పిట్ట ముట్టలేదు/ రావడానికైనా/ ముట్టడానికైనా/ పిట్టలుంటే కదా". ప్రకృతిని పక్షులను కోల్పోయి ఒంటరిగా మిగులుతున్న మనిషి దీనస్థితిని ఇంతకంటే బాగా చెప్పగల కవిత్వ సాధనం ఇంకేమైనా ఉన్నదా?ఒక కళాత్మకత నిర్ధారణను సందేశంగాను, ఉపదేశంగానూ చెప్పడం, సందేశాన్ని కళానిర్మాణంతో కూర్చి, సహజ విషయంగా వెల్లడించడం ఆయనకు మాత్రమే తెలిసిన విద్య. మనిషి, సమాజమే ఆయన కవిత్వం ముడి సరుకులు. మనిషి లేని, సమాజం లేని, మానవత్వం లేని ఊహాతీత పదాల జోలికి ఆయన వెళ్ళలేదు. పెన్నా శివరామకృష్ణ గారు చెప్పినట్టు నాడైనా నేడైనా సామాజిక, రాజకీయ అంశాలకు దూరమైన కవితలను ఆయన రాయలేదు.కరోనా వైరస్ ఒక ప్రపంచ కుదుపు. ఆ కుదుపులో సోలిపోయిన జీవితాలను సిధారెడ్డి లోపలి కవి పట్టుకున్నాడు. "కాళ్ళ కింద నదులే/ కళ్ళ కింద నదులే/ మనిషిని చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేసే" నదులను కవి చూడగలిగాడు. ఆ ఉపద్రవపు తీరొక్క మానవ అంతర్ మదనాలను ఆయన కవిత్వం చేశారు. నూటా పన్నెండు పేజీల 'అనిమేష' నిండా ఉన్నది మనిషి వేదనే. ముంగిలికొచ్చిన వింత విపత్తు ఎంతటి ప్రమాదమో తెలియని గడ్డుస్థితిని ఆయన కవిత్వం చేశారు. కాలం క్యాలెండర్‌కు అడ్డం తిరిగి, విషకోర కాటుకు మానవత్వం కాలిన వాసనను కవిత్వంతో చిత్రీకరించారు.మనిషి చావు బతుకుల అలాంటి దైన్యస్థితిలోనూ పెట్టుబడిదారీ విధానం నిసిగ్గుగా తన వికృత రూపాన్ని ప్రదర్శించింది. శవాల మీద లాభాలను కొల్లగొట్టుకునేందుకు పెట్టుబడి రాబందులు అన్ని రకాలుగా అస్త్రశస్త్రాలను సంధించాయి. ఈ నాటకీయ పరిణామాలు సిధారెడ్డి దృష్టిని దాటిపోలేదు. విజ్ఞుడైన, ప్రజాపక్షపాతి అయిన ఏ కవి దృష్టినీ అవి దాటిపోలేవు. కరోనా శరీరంలో బతుకుతుంది.. సార్వభౌమత్వం పెట్టుబడిలో బతుకుతుంది-- అనే నిజాన్ని గ్రహించినవాడు కాబట్టి ముల్లుని ఆర్థికముల్లే అని తేల్చేశాడు. వ్యాపారం భుజం మీద చేయి వేసి కొత్త రూపం ఎత్తనున్న రాజకీయ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాడు. ఎవరికి అర్థం కాని ఈ ఆటలో "ప్రపంచం ప్రయోగశాల/ జీవితం చిక్కులవల" అనే విషయాన్ని విశదీకరించాడు.'అనిమేష' సంపుటి మొత్తం కేవలం కరోనా కవితలే అనుకుంటే పొరపాటే. వ్యాధిగ్రస్త సంక్షోభ సమయంలో మనుషుల మానసిక సంఘర్షణ, వైరస్ పేరుతో దోపిడికి తెగబడ్డ మార్కెట్ పెట్టుబడి శక్తుల యుక్తులు, ఈ విపత్తు ధాటికి చిగురుటాకుల వణికిన సమాజంలోని అట్టడుగు వర్గాలు... ఒకటేమిటి సమస్త మానవాళి భావోద్వేగాలకు, కాదు సమస్త విషయాల సమగ్ర చర్చకు ఇందులో అక్షర రూపం ఇచ్చారు. "స్నేహం చూపడానికి లేదు/ ప్రేమ ప్రకటించడానికి లేదు/ మంటల్లోంచి లేచే మూకుమ్మడి కమురువాసన/ జాలి జాలిగా గాలిలో కలిసిపోతుంది/ గాలికి మొక్కాలె.. గాలి వైరస్‌ను త్యజించింది". పొగిలి వచ్చే దుఃఖాలను నాలుగు గోడల మధ్య అణచివేసుకున్న పరిస్థితులను 'అనిమేష' ద్వారా మనకు గుర్తు చేస్తున్నారు సిధారెడ్డి.

భయం, ఒంటరితనం, భవిష్యత్తు పట్ల అనిశ్చితి ఆ కాలంలో మానవ జీవితాలను కుదిపేసింది. సిధారెడ్డి కవిగా ఆ కాలాన్ని రికార్డు చేశారు. కోవిడ్ కాలంలో ప్రపంచవ్యాప్తంగా చాలా సంకలనాలు వచ్చాయి. ౹ాశీవ్‌తీఝఅసఎశీజఱఎ.ఎశీఎ లాంటి వెబ్‌సైట్లు ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ కవిత్వానికి వేదికగా నిలిచాయి. 'ది

# ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

మొదటిపేజీ తరువాయి

24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷-లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం అని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

# యుద్ధ విస్తరణే ఇరాన్ ప్రధానాస్త్రం!

మొదటిపేజీ తరువాయి

అవసరమైతే యుద్ధాన్ని ఎంత దూరమైనా తీసుకెళ్తానన్న సంకేతాలు ఇవ్వడం ద్వారా ప్రత్యర్థి పక్షాన్ని ఒకింత భయం గుప్పిట్లో టెహ్రాన్ ఉంచుతోంది. తాజా యుద్ధంలో ఇదే ఆ దేశ ప్రధానాస్త్రంగా ఉంది.

**తరచి చూస్తే..**

తాజా యుద్ధంలో మొదటి ఆరు రోజుల్లోనే అమెరికాకు 1,270 కోట్ల డాలర్లు ఖర్చయ్యాయి. ఈ నేపథ్యంలో 20 వేల కోట్ల డాలర్లు ఇవ్వాలని అమెరికా రక్షణ శాఖ.. కాంగ్రెస్‌ను అడుగుతోంది. ముడిచమురు ధరకు అమాంతంగా రెక్కలు వచ్చాయి. ఇరాన్ దాడుల్లో.. ప్రపంచంలోనే అతిపెద్ద సహజవాయు కర్మాగారం రస్ లఫాన్ దెబ్బతింది. ఖతార్‌కు మకుటాయమానమైన ఈ ప్లాంట్ పూర్తిస్థాయిలో తెరుచుకోవడానికి కనీసం ఐదేళ్లు పడుతుంది. దీనివల్ల ఏటా 2వేల కోట్ల డాలర్ల నష్టాన్ని ఆ దేశం మూటగట్టుకోవాల్సి వస్తోంది. మొత్తమ్మీద బహ్రెయిన్ నుంచి అబుధాబీ వరకూ చమురు డిపోలన్నీ చౌకైన ఇరాన్ డ్రోన్ల దాడికి గురవుతున్నాయి. హర్మూజ్ జలసంధి దిగ్బంధంతో చాలా దేశాల్లో చమురు, గ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. అంతం ఎప్పుడో తెలియని రీతిలోకి ఈ పోరు జారిపోయింది. ఇది ఏరోజు ఏ మలుపు తీసుకుంటుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

**ముందే చెప్పినా..**

తమపై దాడి చేస్తే గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా స్థావరాలపై విరుచుకుపడతామని ఇరాన్ మొదటి నుంచీ హెచ్చరిస్తూనే ఉంది. ఈసారి అమెరికా యుద్ధం మొదలుపెడితే అది ప్రాంతీయ ఘర్షణగా మారుతుందని ఇటీవల మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ గత నెలలో స్పష్టంచేశారు. అయినా ప్రస్తుత ఇరాన్ ప్రతిదాడులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను విస్మయంలో ముంచెత్తుతున్నాయి. టెహ్రాన్ ప్రతిఘటన సామర్థ్యాన్ని అగ్రరాజ్యం సీరియస్‌గా తీసుకోలేదని దీన్నిబట్టి తేటతెల్లమవుతోంది. తమ ఇంధన మౌలిక వసతులపై దాడి చేస్తే యుద్ధంలో కొత్త దశ మొదలవుతుందని ఇటీవల దాడుల్లో చనిపోయిన ఇరాన్ భద్రతా విభాగం అధిపతి అలీ లారిజానీ హెచ్చరించారు. అయినా ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయెల్ దాడి చేసింది. దీనికి ప్రతికారంగా రస్ లఫాన్‌పై టెహ్రాన్ దాడి చేసింది. తమ వద్ద ఇంకా 'ఆప్షన్లు' ఉన్నాయని, సరైన సమయంలో వాటిని బయటకు తీస్తామని ఇరాన్ ఉన్నతాధికారి ఒకరు ఇటీవల హెచ్చరించారు. గల్ఫ్ ప్రాంతంలోని నిర్లవణీకరణ కేంద్రాల (డీశాలినేషన్ ప్లాంట్లు)పై దాడి వ్యూహం కూడా ఇందులో ఉండొచ్చని భావిస్తున్నారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే గల్ఫ్ ప్రాంతంలో చాలాచోట్ల ఈ కర్మాగారాలే ప్రధాన తాగునీటి వనరులు. ఇవి ధ్వంసమైతే పెను సంక్షోభం తప్పదు.

# హర్మూజ్‌ని దాటి భారత్ దిశగా రెండు ఎల్పీజీ నౌకలు



మొదటిపేజీ తరువాయి

దేశంలో ఇంధన కొరత ఆందోళనల వేళ.. భారత్‌కు చెందిన కొన్ని నౌకలు నెమ్మదిగా హర్మూజ్ జలసంధిని దాటుతుండటం ఒకింత ఉపశమనం కలిగిస్తోంది. తాజాగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి.

ఇరాన్‌లోని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (×=+జ) అనుమతితో జగ్ వసంత్, పైన్ గ్యాస్ అనే రెండు ఎల్పీజీ నౌకలు సోమవారం ఉదయం హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే ఈ నౌకలు దేశీయ పోర్టులకు చేరనున్నట్లు తెలిపాయి. దీంతో దేశీయంగా వంట గ్యాస్ లభ్యత మరికొంత పెరిగే అవకాశం ఉంది.

నౌక హర్మూజ్ దాటాలంటే రూ.18 కోట్లు ఛార్జి..!

ఉద్రిక్తతల కారణంగా భారత్‌కు చెందిన నౌకలు రోజులతరబడి అక్కడే నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మన నౌకలు సురక్షితంగా హర్మూజ్ దాటేందుకు.. ఇరాన్ అధికారులతో కేంద్రం నిరంతరం సంప్రదింపులు జరిపింది. దీంతో కొన్ని రోజులుగా భారత నౌకలు ఒక్కొక్కటిగా దేశీయ పోర్టులకు చేరుకుంటున్నాయి. అయితే, ఇరాన్ సీనియర్ లీడర్ అలీ లారిజానీ మరణం, ఆ దేశ చమురుక్షేత్రాలపై అమెరికా దాడులు వంటి కారణాలతో నౌకల ప్రయాణానికి అనుమతులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.

# వంటగ్యాస్ కొరతపై

## ఆందోళన వద్దు: మంత్రి పార్థసారథి

మొదటిపేజీ తరువాయి

ప్రత్యామ్నాయంగా ఇండక్షన్ స్టవ్ లు, పైప్ లైన్ గ్యాస్ కనెక్షన్లు పెంచాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

**పంట నష్టం అంచనాలు**

అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ఏఐ టూల్స్ ద్వారా ముందస్తు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల మిర్చి రైతులు తమ ఉత్పత్తులను కాపాడుకోగలిగారని వివరించారు. అకాల వర్షాల పంట నష్టం అంచనాలను ఈనెల 26 నాటికి పూర్తి చేసి, 27 నుండి 29 వరకు రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. ఈనెల 31 నాటికి పూర్తిస్థాయి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించినట్లు తెలిపారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

**మొక్కజొన్న రైతులకు మేలు**

మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పార్థసారథి తెలిపారు. దిగుబడి పెరగడం వల్ల ధర తగ్గిందని, కేంద్రం నుంచి నష్టపరిహారం రాబట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించినట్లు పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించి ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 1000 వరకు సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఇళ్ల మంజూరుపై భరోసా**

రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల కోసం సుమారు 10 లక్షల దరఖాస్తులు అందాయని, వాటిలో 7 లక్షల వరకు అర్హమైనవిగా గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు. పీఎంఏవై 2.0 పథకంలో భాగంగా ఇళ్లు లేని వారికి గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వ శాఖల పనితీరును అంచనా వేస్తున్నామని, ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

# సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు

మొదటిపేజీ తరువాయి



ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని,బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారు.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నాం అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. బిఆర్ఎస్ నేతలు పెండింగ్ లో పెట్టి వెళ్లిన మూడు డి ఏ ల ను మా ప్రభుత్వం చెల్లించిందని అసెంబ్లీలో చెప్పారు.రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడు సంవత్సరాలకు పెంచిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచింది. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడంతో 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వం పైపడిందని అన్నారు. ఇప్పటికే ఉ ద్యో గ ు ల మెడికల్ బిల్లులను మొత్తం క్లియర్ చేశాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి గత ప్రభుత్వం 40, 150 కోట్లు బకాయిలు పెట్టారు. ఈ విషయంపై సభలో శ్వేత పత్రం విడుదల చేసాం. ఆ బకాయిల్లో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మొత్తం 4,575 కోట్లు ఉన్నాయని వివరించారు.మా ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు ప్రతినెల 700 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. రాబోయే రోజుల్లో బకాయిలు త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రతినెలా చెల్లించి 700 కోట్లను 1000 కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచన ఈ ప్రభుత్వం చేస్తుందని భట్టి అన్నారు. తాము ప్రతి సమస్యనూ మానవీయ కోణంలోనే చూస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏ బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. అవన్నీ త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ ప్రయోజనాలను గత ప్రభుత్వం చెల్లించలేదు. రిటైర్‌మెంట్ ప్రయోజనాలు చెల్లించలేకే పదవీ విరమణ వయసు పెంచారు. దీంతో మా ప్రభుత్వంపై అదనపు భారం పడింది. గత ప్రభుత్వం రూ.40,154 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. ఉద్యోగులకు కూడా రూ.4,571 కోట్లు బకాయిలు పెట్టింది. సాధ్యమైనంత త్వరగా ఉద్యోగులకు బకాయిలు చెల్లిస్తాం. మానవీయ కోణం ఉంది కాబట్టే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నాం. ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇస్తున్నాం అని చెప్పారు.

# జగన్ పై షర్మిల రెడ్డి నిప్పులు

మొదటిపేజీ తరువాయి

వివేకా హత్యను అవినాష్ రెడ్డి తప్పుదారి పట్టించారని, గుండెపోటు కట్టుకథ ఆయన సృష్టేనని ఆరోపించారు. దీనిపై సమాధానం చెప్పలేక జగన్, భారతి తనపై అపనిందలు వేస్తున్నారని తెలిపారు.

**కట్టుకథలు నమ్మం**

విజయమ్మ రాసిన లేఖపై సమాధానం చెప్పే దమ్ము లేక జగన్ ఇతర నాయకులతో మాట్లాడిస్తున్నారని షర్మిల రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ లేఖ నిజం కాకపోతే విజయమ్మే స్వయంగా ఖండించేవారని, కానీ ఆమె అలా చేయలేదంటే అది నిజమేనని పేర్కొన్నారు. వైఎస్ఆర్ భార్యగా ఆమె తన ఆవేదనను లేఖ ద్వారా వ్యక్తం చేశారని, ఆస్తుల్లో సగభాగం ఉండాలని, నలుగురు మనుమలకు సమానంగా పంపిణీ జరగాలని వైఎస్ఆర్ ఆదేశించినట్లు వివరించారని తెలిపారు. ఆస్తుల కోసం తాను కోర్టుకు వెళ్లలేదని, స్వార్థ రాజకీయాల కోసం ఎవరితోనూ చేతులు కలపలేదని స్పష్టం చేశారు.

**విశ్వసనీయత కోల్పోయిన జగన్**

జగన్ తన విశ్వసనీయతను పూర్తిగా కోల్పోయారని షర్మిల రెడ్డి విమర్శించారు. సాక్షి పత్రికలో వైఎస్ఆర్ ఫోటో పెట్టుకుని సత్యమేవ జయతే అంటూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విజయమ్మ లేఖపై జగన్ కు దమ్ముంటే నేరుగా స్పందించాలని డిమాండ్ చేశారు. తాను వైఎస్ఆర్ ఆశయాల కోసం నడుస్తున్న వ్యక్తిని అని, అధికారం కోసం ఎవరి కాళ్లు పట్టుకోవాల్సిన అవసరం తనకు లేదని తెలిపారు. అబద్ధాన్ని వందసార్లు చెప్పినా అది నిజం కాదని, ప్రజలకు అన్ని విషయాలు తెలుస్తున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# బియ్యం రవాణాలో కుంభకోణం:

మొదటిపేజీ తరువాయి



"బియ్యం ఎగుమతి కోసం టెండర్లు పిలిచారా నాఫెడ్‌కు అనుమతి ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థకు ఎందుకిచ్చారో చెప్పాలి. కాకినాడ పోర్టులో 7,500 టన్నుల బియ్యం ఉన్నది నిజమా.. కాదా ఆ పోర్టులో గిడ్డంగి, నిర్వహణ ఛార్జీలు చెల్లిస్తున్నారా లేదా బియ్యం రవాణాలో కుంభకోణం జరిగింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. ఈ అంశంపై హౌస్ కమిటీ వేసి నన్ను కూడా సభ్యుడిగా ఉంచాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# కనిగిరి ఆకృతి షాపింగ్ మాల్ దొంగతనం కేసు ఛేదన

**- అంతర్జిల్లా దొంగ అరెస్ట్, రూ. 9.5 లక్షల నగదు, బంగారం రికవరీ**

మార్కాపురం, మార్చి 24, 2026: కనిగిరి పట్టణంలోని ఆకృతి షాపింగ్ మాల్‌లో జరిగిన భారీ చోరీ కేసును మార్కాపురం జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన పాత నేరస్తుడు వడ్లమాను శివారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు మరియు దొంగిలించిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్ గారు ప్రత్యేకంగా అభినందించారు.

**ఘటన నేపథ్యం మరియు దర్యాప్తు వివరాలు:**

కనిగిరి పట్టణానికి చెందిన ఆర్నూరి కేశవరావుకు చెందిన ఆకృతి షాపింగ్ మాల్‌లో ఈ నెల 19వ తేదీ రాత్రి చోరీ జరిగింది. నిందితుడు షాపు వెనుక భాగం నుండి పైకి ఎక్కి, రేకుల కట్టర్‌తో పైకప్పును కట్ చేసి లోపలికి ప్రవేశించాడు. కౌంటర్‌లో ఉన్న నగదు మరియు బంగారు సరుడును అపహరించి పరారయ్యాడు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా, కనిగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం (మార్చి 24న) కనిగిరి-పొదిలి రోడ్డులోని లారీ ఆఫీసు సమీపంలో నిందితుడు శివారెడ్డి సంచరిస్తున్నట్లు అందిన పక్కా సమాచారంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.



నిందితుడు గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడిపై గతంలో మార్కాపురం, ఒంగోలు, గిద్దలూరు, పిడుగురాళ్ళ, వినుకొండ, గుంటూరు వంటి పలు ప్రాంతాల్లో షాపులు మరియు దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడిన చరిత్ర ఉంది.

**రికవరీ చేసిన సొత్తు:**

నిందితుడి నుండి పోలీసులు రూ. 9,49,800/- నగదుతో పాటు, 30 గ్రాముల బరువున్న బంగారు సరుడు మరియు దర్శి ప్రాంతంలో దొంగిలించిన ఏపీ27డీవీ3997 నంబర్ గల మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఇటీవల చీరాల తోటవారిపాలెం పోలేరమ్మ గుడిలో కూడా దొంగతనం చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు.

**పోలీసుల కృషికి అభినందనలు:**

అత్యంత వేగంగా స్పందించి, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన కనిగిరి సిఐ యు. శ్రీనివాసులు, ఎస్ఐ మరియు వారి సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్ రాజు గారు ప్రశంసించారు. నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడమే తమ ప్రథమ కర్తవ్యమని ఈ సందర్భంగా పోలీసులు పేర్కొన్నారు

# ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగయ్యాయి

**- ఎంఈఓ రాజాల కొండారెడ్డి**





**చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ**

గ్యారంటీడ్ ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ( ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం అమలు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగయ్యాయని మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి అన్నారు మంగళవారం మండలంలోని 4 క్లస్టర్ల పరిధిలో 52 పాఠశాలలకు చెందిన 232 మంది విద్యార్థులకు గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ పోటీలు నిర్వహించారు సి ఎస్ పురం, శీలంవారిపల్లి, నాగులవరం, అంబవరం క్లస్టర్ల పరిధిలో పాఠశాల స్థాయి విజేతలకు క్లస్టర్ పరిధిలో పోటీలు నిర్వహించారు తెలుగు, ఆంగ్లం, గణితం లలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు 75 రోజులపాటు అమలు చేసిన జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం వల్ల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మెరుగయ్యాయన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు ఉన్నాయని, తల్లిదండ్రులు సమాజంలోని భాగస్వాములు ఎవరైనా తమ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసనస్థాయి లను పరీక్షించుకోవచ్చనే ఛాలెంజ్ ని జిఎఫ్ఎల్ఎన్ అమలు తర్వాత అందరికీ తెలిసేలా చేయడం జరిగిందని అన్నారు 4 క్లస్టర్ల పరిధిలో 20 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని, మండల స్థాయి జిఎఫ్ఎల్ఎన్ పోటీలు ఈనెల 31 వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు మండల స్థాయి విజేతలకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు మండలం తరఫున 5 గురు విద్యార్థులను జిల్లా స్థాయి జిఎఫ్ఎల్ఎన్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలులో భాగంగా మంచి పనితీరు కనబరిచిన ఉపాధ్యాయులు జె భారతి, మహేశ్వర్ రెడ్డి లను మరియు విద్యార్థులను సత్కరించడం జరిగింది మండలంలోని క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు షేక్ కరీమున్నిసాబేగం, షేక్ షరీఫ్, బి డేవిడ్, ఎన్ తిరుపతయ్య, సిఆర్ఎంటి లు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు, ఎస్ఎంసి సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

# కుప్పంలో నారా భువనేశ్వరి పర్యటన: మహిళా స్వయం ఉపాధే లక్ష్యం!





రాష్ట్ర ముఖ్యమంత్రి మన శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి అమ్మగారు కుప్పం నియోజకవర్గ నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు మంగళవారం కుప్పం మండల పరిధిలోని మంకలదొడ్డి గ్రామానికి చేరుకున్నారు. స్థానిక మహిళలు భువనమ్మకు ఘన స్వాగతం పలికారు. మంకలదొడ్డి గ్రామంలోని మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో అమ్మగారితోపాటు కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ, ఖాదీ బోర్డు చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ గారు పాల్గొనడం జరిగింది. మహిళలు ఆర్థికంగా ఎదిగితే వారి కుటుంబాలు బాగుంటాయని, మహిళలు ఆర్థికంగా ఎదగేందుకు స్వయం ఉపాధి ఎంతో అవసరమని, దానికి కావాల్సిన సహకారం ప్రభుత్వం అందిస్తుందని భువనమ్మ మహిళలకు చెప్పారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముఖ్యనాయకులు, మరియు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# ఎన్నికల హామీని నెరవేర్చకపోతే భూ పోరాటానికి సిద్ధం






**- రావుల వెంకయ్య డిమాండ్**

2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో అర్హులైన లబ్ధిదారులను మమేకం చేసి భూ పోరాటానికి సిద్ధపడతామని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను కేటాయించి గృహ నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయలను మంజూరు చేస్తానని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లను ఇవ్వాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో పట్టణంలోని సిపిఐ కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు లబ్ధిదారులతో ర్యాలీ నిర్వహించి అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో నిరుపేదలకు ఇచ్చిన ఒక సెంటు భూమి ఎలా సరిపోతుందని ప్రశ్నించిన కూటమి ప్రభుత్వం నాయకులు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ లు మేము అధికారంలోకి వస్తే నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు కేటాయించి అందులో గృహ నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయలను ఇస్తామని నమ్మబలికి గెలిచిన అనంతరం ఆ దిశగా పని చేయకుండా కాలయాపన చేయటం సరైన పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో నిరుపేదలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటించాలని లేనిపక్షంలో లబ్ధిదారులతో కార్యాచరణ రూపొందించుకొని సిపిఐ తరుపున భూ పోరాటానికైనా సిద్ధపడతామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి ఒక్కటి కి రాష్ట్ర ప్రభుత్వం తెలుపకుండా ప్రజల సంక్షేమాన్ని సైతం దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన సూచించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి భూసి సురేష్ బాబు మాట్లాడుతూ నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారులకు పింఛన్లను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు యర్రంశెట్టి ఆనందమోహన్, కే మురళి, నత్తా రామారావు, నీలిశెట్టి నరసయ్య, బొజ్జ చంద్రమోహన్, చేవూరి దుర్గాప్రసాద్, నాయకులు ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాల బ్రహ్మాచారి, కోటేశ్వరరావు, లింగాబత్తిన మాధురి, స్కంద పూరి పెయింట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జమ్మలమడుగు రవి, కంకణాల చిన బ్రహ్మయ్య, సింగయ్య, మిట్టనోసల సుభాన్, పొంతగాని మాధవ, తన్నీరు రాజు తదితరులు పాల్గొన్నారు.

# పశు పోషకుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం




**- కోనంగి వెంకటకొండయ్య**

**చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ**

మండలంలోని బోయమడుగుల రైతు సేవా కేంద్రంలో మంగళవారం గడ్డి జొన్న విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కనిగిరి శాసనసభ్యులు, జిల్లా టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు, మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ సూచనలతో టిడిపి నాయకులతో కలిసి పశు సంవర్ధక సిబ్బంది సమక్షంలో టిడిపి మండల క్లస్టర్ ఇన్చార్జి కోనంగి వెంకటకొండయ్య రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పశు పోషకుల అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నారని అన్నారు రైతులకు, పశుపోషకులకు అవసరమైన పచ్చికను అందుబాటులోకి తెచ్చేందుకు గడ్డి జొన్న విత్తనాల పంపిణీ చేశారని, పశువులకు పోషకాహారం సమృద్ధిగా లభిస్తే పాల ఉత్పత్తి పెరగడమే కాకుండా పశువుల ఆరోగ్యం మెరుగుపడి, కుటుంబాల ఆర్థిక స్థితి బలపడుతుందన్నారు. ఎన్డీయే కూటమి పాలనలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేయడానికి ఫోడర్ డెవలప్మెంట్, వెటర్నరీ సేవలు, వ్యాక్సినేషన్ డ్రైవ్ లు, పశుపోషకులకు శిక్షణా కార్యక్రమాలు వంటి అనేక చర్యలు చేపట్టిందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుపోషకుల పాత్ర ఎంతో కీలకమైందని, వారికి అవసరమైన సహాయం, మార్గదర్శకత అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు రైతులు గడ్డి విత్తనాల పంపిణీ సంరక్షణలో ప్రభుత్వ కృషిని పలువురు రైతులు అభినందించారు ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు ఎనుముల రమణారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ పి విజయ్, రైతులు పాల్గొన్నారు

# అంబవరం కొత్తపల్లిలో రైతన్న మీకోసం కార్యక్రమం

**చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ**



మండలంలోని అంబవరం కొత్తపల్లిలో మంగళవారం 'రైతన్న మీకోసం' కార్యక్రమం భాగంగా మండల వ్యవసాయాధికారి పి. మధుబాబు సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల కోసం ప్రత్యేకంగా పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. రైతుల అభ్యున్నతి పట్ల ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరవేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు రైతులతో సమావేశమై ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై ఎలినినో ప్రభావం, పశ్చిమ ఆసియా యుద్ధ ప్రభావం వల్ల ఇంధన ధరలు మరియు ఎరువుల మార్కెట్లో ఏర్పడే ఒడిదుడుకులు వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంలో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి




**చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ**

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి లేదా ఇంటిబాడుగ ప్రభుత్వమే చెల్లించాలని సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వజ్రాలా సూబ్బారావు అన్నారు మంగళవారం మండల కేంద్రమైన సిఎస్పురం బస్టెండ్ సెంటరు నుండి తాహాసిల్దార్ కార్యాలయం వరకు సిపిఐ నాయకులు నినాదాలు చేసుకుంటు నిరసన ర్యాలి తో వచ్చి తాసిల్దార్ కార్యాలయం బయట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆనంతర అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాల ఇవ్వాలని సినియర్ అసిసెంట్టు పద్మనాభం మరియు ఆర్ ఐ లకు ఇళ్ళ స్థలాల అర్జిలను అందజేశారు ఈ సందర్భంగా సిపిఐ సి ఎస్ పురం మండల కార్యదర్శి షేక్ పెద్ద మస్తాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధికారంలోకి రాగానే పేదలకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెప్పారని , అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ఊసే మరిచారని అన్నారు గ్రామాల్లో పేదలకు మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు మంజూరు చేయాలని ఇల్లు కట్టుకొనే వారికి 5 లక్షలు ఇవ్వాలని అర్హులైన పేదలందరికి పెన్షన్లు మంజూరు చేయాలనీ భూమి లేని నీరు పేదలందరికి సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు కూలి పనులు లేక ఇబ్బందులు పడుతున్న పేదలు బ్రతుకుటకు భరోసా కల్పించాలని రాష్ట్రంలో నిలిచిపోయిన ఇళ్ళ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వృద్దులకు వితంతువులకు ఒంటరి మహిళలకు వికలాంగులకు ఇప్పటి వరకు ఒక్క పెన్షన్ మంజూరు చేసిన దాఖలాలు లేవని వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో సహాయక కార్యదర్శులు సవరం రమేష్, గువ్వల నరసిహ్మలు, షేక్ మౌలాలి, సవరం రమణయ్య, గిరిజన సంఘ నాయుకులు రాగి గురవయ్య, కె చెంచయ్య, రాగి యేసయ్య, అంకమ్మ బి వెంకటేశ్వర్లు, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు

# సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

**– సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాధాకృష్ణయ్య**





**ప్రజలకు చేరువ**

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తోందని ఏలూరు ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షులు బడేటి చంటి పేర్కొన్నారు. సూర్యఘర్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. సూర్యఘర్ పథకంలో భాగంగా జిల్లాలోనే ప్రప్రథమంగా ఏలూరు సత్రంపాడులోని ఎమ్మార్సీ కాలనీ అంబేద్కర్ నగర్ లోని దేవా మోషే ఇంటి పై సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేశారు. దీని ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బడేటి చంటి లబ్ధిదారుడు మోషే చేతులు మీదుగా దీన్ని ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రతి పథకం ప్రజలకు ఎంతో మేలు చేసేదిగా ఉంటున్నాయని పేర్కొన్నారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ ఎస్టీ గృహాలపై రెండు కిలోవాట్ల సౌకర్యం కలిగిన సౌర విద్యుత్ ఫలకాలను ఉచితంగా అమర్చడం జరుగుతుందని చెప్పారు. దీని ద్వారా 240 యూనిట్లు కరెంటు ఉత్పత్తి అవుతుందని, ఈ వర్గాలకు 200 యూనిట్లు వరకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుందని, సూర్యఘర్ లో ఉత్పత్తి అయ్యే మిగిలిన నలభై యూనిట్ల కరెంటును విద్యుత్ శాఖ తీసుకుని లబ్ధిదారునికి చార్జీలు చెల్లిస్తుందని తెలిపారు. అలాగే మిగిలిన వారు కూడా సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ప్రభుత్వం 78 వేల రూపాయల వరకు రాయితీ ఇస్తుందని చెప్పారు. ఆర్టీసీ విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని వారికి వెసులుబాటు కల్పించే పథకాలకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయని చెప్పారు. ప్రతి ఒక్కరు సౌర విద్యుత్తును వినియోగించుకుంటే కరెంటును ఆదా చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఇ సాల్మన్ రాజు మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా జిల్లాకు సంబంధించి ఏలూరులోనే సూర్య ఘర్ పథకం కింద ఎస్సీ లబ్ధిదారుని గృహంపై సౌర విద్యుత్తు ఫలకాలు అమర్చినట్లు తెలిపారు . కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, క్లస్టర్ ఇంచార్జ్ ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు, క్లస్టర్ కో ఇంచార్జ్ ఆర్ఎన్ఆర్ రాజేశ్వరరావు, డివిజన్ ఇంచార్జిలు కొండే రాణి నిర్మల కుమారి, అట్లూరి రామకృష్ణ, డివిజన్ కో ఇన్చార్జిలు మద్దు ప్రసాద్, కేతినిడి కిషోర్, బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ బోర్డ్ డైరెక్టర్ లంకపల్లి మాణిక్యాలరావు, తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు ముళ్ళపూడి అశోక్, వేల్పుల అరుణ,సతీష్, చందు, జనసేన నాయకులు వీరంకి పండు, బిజెపి నాయకులు నడపన భాస్కరరావు,ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ అంబేద్కర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్ కుమార్, మరియు వివిధ హోదాలలో ఉన్న కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శీలంవారిపల్లిలో శ్రీరామనవమి 41వ వార్షికోత్సవానికి భారీ ఏర్పాట్లు

**– మార్చి 26 నుండి 28 వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు**

**– శ్రీరామనవమికి వచ్చే భక్తులకు కదిరి బాబురావు కళాశాలలో వసతి ఏర్పాటు**

**చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ**




మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో ఈ నెల 26 నుండి 28 వరకు పూర్తిగా రామనామంతో శ్రీరామనవమి 41 వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం కానున్నాయి శీలంవారిపల్లి గ్రామంలో పుణ్యక్షేత్రమైన శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని 41వ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని దేవస్థానం కమిటీ, గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ ఉత్సవాలు గ్రామంలో పండుగ సందడిగా మొదలైంది. శ్రీరామనవమి పండుగ వేడుకలు 26వ తేదీ ఉదయం 6 గంటలకు అంకురార్పణంతో ప్రారంభం కానున్నట్లు అనంతరం సుప్రభాత సేవ, దేవాలయ ఉత్సవాలకు ప్రత్యేకతను తెచ్చే నాదస్వర కచేరి నిర్వహించనున్నారు.మంగళవాయిద్యాల ధ్వనితో దేవాలయ ప్రాంగణం భక్తి రసమయంగా మారనుంది.

27వ తేదీ ఉదయం సుప్రభాత సేవ, నాదస్వర కచేరితో కార్యక్రమాలు మరియు ఉదయం 8 గంటలకు పిడుగు బ్రదర్స్ ఌ సిస్టర్స్ ఆధ్వర్యంలో అల్పాహార విందు ఏర్పాటు చేశారు మధ్యాహ్నం 12 గంటలకు సీతారామస్వామి కళ్యాణ మహోత్సవమును అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే ఈ వేడుకకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు కదిరి వెంకట నరసయ్య లక్షమ్మ జ్ఞాపకార్థం కుమారులు కదిరి ప్రకాష్ రావు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, కదిరి పార్థసారథి, కదిరి బాలకృష్ణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు రాత్రి 8 గంటలకు సీతారామలక్ష్మణస్వామి గ్రామోత్సవం మరియు కొట్టే కేశవయ్య కుమారుడు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుమారుల ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన భక్తులను అలరించనుంది 28 న ఉదయం సుప్రభాత సేవ అనంతరం వసంతోత్సవం, గ్రామోత్సవం భక్తుల సందడితో వనభోజనాలు నిర్వహిస్తారు సాయంత్రం నాలుగు గంటలకు లంక దహనం రాత్రి 7 గంటలకు పట్టాభిషేకం ఘనంగా జరగనుంది రామాయణ ఘట్టాల ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు రాత్రి 8 గంటలకు కదిరి వెంకట నరసయ్య లక్షమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇరగని చలపతిరావు మరియు కుటుంబ సభ్యుల సహకారంతో సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ డ్యాన్స్ అకాడమీ కళాకారులచే కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శనలు అలరించనున్నాయి భక్తుల సౌకర్యం కోసం రహదారులు శుభ్రపరిచే పనులు, విద్యుత్ అలంకరణలు, దేవస్థానం ముందు పందిరి , దేవస్థాన పనులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు శ్రీరామ వచ్చు భక్తులకు కదిరి బాబురావు కళాశాలలో వసతి ఏర్పాటు చేశారు ఈ ఉత్సవాలకు భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి సీతారాముల ఆశీర్వాదం పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు

# ప్రత్యక్ష, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఊతం

**– నమ్మకాన్ని నిలబెట్టిన ప్రభుత్వం డా. ఎం. ఉమేష్ రావు**

**ప్రజలకు చేరువ**

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రాధాన్యం ఇస్తూనే పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం ముందంజలో ఉందని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం. ఉమేష్ రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గనిర్దేశంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కార్యదక్షతతో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో నిలుస్తోందని ఆయన అన్నారు.అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో భారీ ఉక్కు పరిశ్రమకు ఇటీవల భూమిపూజ జరగడం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి శుభ సూచకమని ఉమేష్ రావు అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు.సుమారు రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ పరిశ్రమ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనుందని పేర్కొన్నారు.ప్రభుత్వం కేవలం ఉద్యోగాల కల్పనకే కాకుండా యువతకు స్థిరమైన కెరీర్, జీవనోపాధి అవకాశాలు అందించడంపై దృష్టి సారిస్తోందని ఆయన అన్నారు. ఇంత పెద్ద ప్రాజెక్ట్ కోసం భూములు సమకూర్చిన రైతులకు కృతజ్ఞతలు తెలుపుతూ,



భవిష్యత్తులో ఈ ప్రాంతం "స్టీల్ సిటీ"గా రూపుదిద్దుకునే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా. జి. దశరథాచారి, మిన్నల్ రవి, యం. సుబ్బయ్య, బీమాల భాస్కర్ ముదిరాజ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, గంగనపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్ఆర్ నిధులతో గార్బేజ్ ఆటోలు ప్రారంభం

**– పరిశుభ్రతకు శ్రీకాళహస్తిలో కొత్త అడుగు**

**ప్రజలకు చేరువ**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచే దిశగా కీలక చర్యలు చేపట్టారు. కోకో కోలా సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మూడు గార్బేజ్ ఆటోలను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు.ఈ వాహనాలను శ్రీకాళహస్తి మండలంలోని కాపుగున్నేరి, చెర్లోపల్లి, తొండమనాడు గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున



కేటాయించారు. ఒక్కో గార్బేజ్ ఆటో విలువ రూ.4 లక్షలుగా ఉందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, తడి మరియు పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా గ్రామాలను మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంలో ఈ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు.సామాజిక బాధ్యతతో ప్రాంత అభివృద్ధికి సహకరిస్తున్న సంస్థలను అభినందించిన ఆయన, రాబోయే రోజుల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పించి శ్రీకాళహస్తిని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# తిరుమల పవిత్రతకు భంగం వైసీపీపై సుధీర్ రెడ్డి తీవ్ర విమర్శలు

**ప్రజలకు చేరువ**

తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసీపీ నేతలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హెచ్చరించారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు అన్యమత ప్రచారం, డిక్లరేషన్ వంటి అంశాలపై స్పందించని వైసీపీ నాయకులు, ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత హిందుత్వం పేరిట రాజకీయ లాభం పొందాలని ప్రయత్నించడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.గతంలో టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి వంటి వ్యక్తులను నియమించడం ద్వారా తిరుమల ప్రతిష్టను దెబ్బతీశారని, హిందూమతంపై గౌరవం లేని వారిని కీలక పదవుల్లో ఉంచడం దురదృష్టకరమని అన్నారు. శ్రీవేంకటేశ్వరుడిని అవమానకరంగా సంబోధించిన



వ్యక్తికి భక్తి ఉందా అని ఆయన ప్రశ్నించారు.తిరుమలేశుడిపై నిజమైన భక్తి ఉంటే, స్వామివారి ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారం ఎలా జరిగిందో వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో తిరుమల క్షేత్రాన్ని దోపిడీ కేంద్రంగా మార్చి, స్వామివారి నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు.అదే సమయంలో కూటమి నాయకులపై డీప్ ఫేక్ ఫోటోలు, వీడియోలు సృష్టిస్తూ తప్పుడు ప్రచారం చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రజలు ఇప్పటికే 2024 ఎన్నికల్లో వైసీపీకి తగిన తీర్పు ఇచ్చారని, 2029లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాకుండా చేయాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.కూటమి నాయకులకు దేవుడిపై భయం, భక్తి ఉన్నాయని, తిరుమలేశుడికి ద్రోహం చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు.